# మలుపు

కేవస్వ



హనీమూన్ దంపతులు శేఖర్ శిరీషా బెంగుళూర్ సూపర్ డీలక్స్ బస్సు ఎక్కారు.

రిజర్వేషన్ టిక్కెట్లు చెక్‌చేసి నంబర్స్ ప్రకారం సీట్లలో సర్దుబాటు చేశాడు కండక్టర్.

లగేజీ సర్దటం అయాక, బస్సు బయలు దేరటానికి ఇంకా వ్యవధుందని బిస్కెట్లూ, సిగరెట్లూ కొనితేవటానికి బస్ దిగాడు శేఖర్.

తిరిగొస్తుండగా అలోగా బస్‌వేపే వస్తున్న డ్రైవర్‌ని చూసి క్షణంపాటు ఆగాడు. పలకరించబోయి మానేశాడు. బస్‌లోకొచ్చి కూచున్నాడు.

ఐదు నిమిషాలు ముందుగా బస్సెక్కాడు డ్రైవర్. కండక్టర్‌తో కాస్సేపు మాట్లాడేడు.

కండక్టర్ టైము చూసుకుని చార్ట్ సరిచూసుకుని రైట్ అనగానే బస్ స్టార్టయింది.

వదిలి వెళ్తున్న ఊరివేపు ఎప్పుడూ చూడనిదానిలా వింతగా చూస్తోంది శిరీష.

డ్రైవర్‌వేపే చాలాసేపు చూస్తూండి పోయి, కొంతసేపటికి తేరుకుని, "శిరీ-" అన్నాడు శేఖర్.

"వూఁ" అంది శిరీష. ఆ గొంతుకలో ఇంకా పెళ్ళయిన అయిదోనాటి కలల మత్తు ఉంది.

"మన బస్ డ్రైవర్‌ని చూడు." అన్నాడు శేఖర్.

"ఏంటి?"- అంటూనే చూసింది శిరీష. ఆమె భ్రుకుటి ప్రశ్నార్థకంగా ముడిబడింది. ఆశ్చర్యంగానూ విచ్చుకుంది. 'డ్రైవర్‌ని చూడమంటున్నారెందుకా?-' అని కాబోలు!

శేఖర్ అప్పుడప్పుడు కథలు రాస్తుంటాడు. చిన్నప్పుడు కవితలూ అల్లేవాడట.

కేవలం రాతల్లోనే కాక, నిజజీవితంలోనూ మాటతీరులోనూ కూడా కథకుడి లక్షణాలు పొలికించటం శేఖర్ ప్రత్యేకత.

"చూశావా?-" అన్నాడు, నాటకీయంగా సిగరెట్టు వెలిగించుకుంటూ.

"వూఁ...."

'ఎందుకు చూడమంటున్నారూ ఏమిటీ-!' అని అడుగుతుందనుకున్నాడు.

అలా ఏం అడగలేదు శిరీష.

'ఎందుకో చూడమన్నాడు, చూశాను, విశేషం వుంటే అతనే చెప్తాడుగా'- అనుకుందేమో!

లేక, తను వేరే మూడ్స్‌లో ఉందేమో. మానసికంగా అప్పుడే బెంగుళూరు వెళ్ళిపోయిందేమో!

"నీకో కథ చెప్పనా శిరీ...." అన్నాడు శేఖర్.

"వూఁ...."

"అంటే రాసిన కథా కాదు....రాయబోయేదీ కాదు....కథ....అంతే...."

"వూఁ...."

అసలే కథకుడు. అందునా వెళ్తున్నది హనీమూన్ ట్రిప్పు. కబుర్లూ, కథలూ చెప్పాలని ఎందుకుండదూ?

శిరీష మధ్యమధ్య వూకొడుతూండగా కథ ఇలా చెప్పాడు శేఖర్ —

* * *

అనగనగా వో అబ్బాయి- ఆ అనగనగానే వో అమ్మాయి....అనగా ఇద్దరూ సమకాలికులేనన్నమాట.

అబ్బాయి పేరు రాజనుకుందాం.



రాజులాగే దర్జాగా వుండేవాడు. తిరుపతి ఆర్ట్సు కాలేజీలో బియెస్సీ చదువుతూ వుండేవాడు. రాజులా వుండేవాడు గనుక, హాస్టల్లోపడి అఘోరించక దర్జాగా టౌన్లో ఓ రూము తీసుకుని అందులో సకల సౌకర్యంగా వుండేవాడు.

రూము ఉన్నది ఒక పెద్ద మేడపైన. కింద మూడు వాటా లున్నాయి. మిగతా రెండువాటాల సంగతి తెలీదుగాని మూడో వాటాలో వో చక్కని చుక్క ఉండేది. చుక్క పేరు సుభద్ర అనుకుందాం. సుభద్ర పద్దెనిమిదేండ్ల ఊర్వశిలా ఉండేది. నారచీరలెప్పుడూ కట్టలేదుగాని, కట్టుంటే అచ్చు శకుంతల్లాగే వుండి వుండేది.

ఈ రాజుకి ఆ శకుంతలకి మొదట చూపు కలిసింది. తరువాత నవ్వు కలిసింది. అంతే. ఆ మేడ చాయల్లో అంతకు మించి అవకాశం లేదు.

ఇంటర్ చదువుతోన్న సుభద్రకి ఇంట్లో కట్టడీ వగైరా లేవు. కాని ఎంతైనా ఆడపిల్ల. అదీ సంగతి.

మనసుంటే మార్గం వుంటుంది. రెండు మనసులుంటే ఒకటికి మించిన మార్గాలూ వుంటూవుంటాయి.

బస్‌స్టాప్‌కి మామూలు టైముకంటే ముందే వెళ్ళటం మొదలెట్టింది సుభద్ర. రాజు హాజరు. రెండోనాటికి అక్కడ పలకరింపు లయ్యాయి.

కాలేజినుంచి అరగంట లేటుగా రావటం మొదలెట్టింది సుభద్ర. బస్సులు తెగమిస్సయ్యాయి అప్పుడు!

అలాంటప్పుడల్లా విమెన్స్ కాలేజీ రోడ్డుమీదే చల్లచల్లటి కబుర్లు దొర్లిపోయాయి.

రాజప్పుడు భౌతికంగా రోడ్డుమీదానూ మానసికంగా మబ్బుల్లోనూ నడిచేవాడు– విహరించేవాడు.

చదువుతున్నది బియెస్సీయే అయినా అప్పటికే 'ఇహ జీవితంలో సాధించేదేమీ లేదు....' అనిపించేది.

'పెళ్ళి చేసుకోవాలి, సుభద్రను చేసుకోవాలి'– అనుకునేవాడు.

ఆ మాటే సుభద్రతో అన్నాడు.

"ఓ!–" అంది సుభద్ర. క్షణం కూడా సంకోచం లేకుండా; అదెప్పుడో జరగాల్సినట్టూ, జరక్క తప్పనట్టూ.

పెళ్ళి విషయం ప్రస్తావించిన వారం రోజులదాకా మరీ మహోల్లాసంగా వుండింది రాజుకు.

ఏమో, సాహసించి అన్నాడుగాని, నిజంగా పెళ్ళిచేసుకోవాల్సి వచ్చివుంటే ఎంతో జంకేవాడేమో!

కాని, అనుకోకుండా కథ అడ్డంగా తిరిగింది.

ఒకానొక ఉదయాన్నే రాజు దగ్గిరికి హడావుడిగా వొచ్చాడు క్లాస్‌మేట్ శంకరం– "బాసూ – అన్యాయం బాసూ– అన్యాయం–" అంటూ.

"ఏఁవిటి?– ఏఁవైంది?–" అన్నాడు రాజు, అయోమయంగా.

"సుభద్రా నువ్వూ కలిసి తెగ తిరిగేస్తున్నారటగా.... పెళ్ళికూడా...."

"శంకరం....నీ కెలా తెలిసింది?–"

"అయ్యో... ఎలోగోలే బాసూ .... నిజమే కద! కొంప ముంచావు బాసూ.., నా ఆశలన్నీ సుభద్రమీదే వున్నాయి..."

తెల్లబోయాడు రాజు.

గాభరా కొంచెం అణచుకుని, సంగతంతా చెప్పాడు శంకరం.

వాళ్ళకీ వాళ్ళకీ దూరపు బంధుత్వం ఏదో వుందిట. ఏణ్ణర్థం క్రితం పెళ్ళి మాటలు నడిచాయట. అటూ ఇటూ పెద్దలు పెళ్ళిచేసెయ్యటానికి సిద్ధపడ్డారట. అయితే సుభద్ర వొప్పుకోలేదట. 'పెళ్ళికిప్పుడేం తొందర?....యింకా చదువుకుంటాను....ఇంటరన్నా చెయ్యొద్దా....' అందిట. శంకరం అంటే సుభద్రకి అయిష్టం అంటూ లేదు. సుభద్ర తండ్రి కూతురి ముచ్చటా కాదనలేకపోయాడు. కనీసం శంకరం డిగ్రీచేసేదాకా అయినా ఆగుదామనుకున్నాడు.

"నీకు పుణ్యముంటుంది .... కొంప ముంచకు బాసూ. అసలే సుభద్ర మనసు సున్నితపు త్రాసులాంటిది – బాసూ– నీ ముందింకా బోలెడు లైఫుంది పెళ్ళికేం తొందర?....నీకే కావలిస్తే ఆడపిల్లలు దొరకరా?...వొదిలెయ్యి బాసూ సుభద్రని నా కొదిలెయ్యి. భద్రాకోసమే యీ చదువేడుస్తున్నా బాసూ....అసలు భద్రా లేకుంటే నేను బతకలేను....వొట్టి తిక్క పిల్ల బాసూ. నన్నుడికించాలని నువ్వు పెళ్ళంటే ఓ అనేసుంటుంది – బాసూ... నువ్వేమన్నా అనుకో. నీ కాళ్ళట్టుకుంటా ...."

ఒక మగవాడు ప్రేమకోసం, ప్రేయసి కోసం మరో మగవాడిని అంతగా ప్రాధేయపడటం ఊహించనేలేదు రాజు.

ఆ సాయంత్రమే సుభద్ర నడిగి నిజానిజాలు తేల్చుకున్నాడు రాజు.

శంకరం చెప్పిందంతా నిజమే.

కాని సుభద్ర ధోరణి వేరు. ఆ పిల్ల ప్రేమనుగానీ ప్రేమికుణ్ణిగానీ సీరియస్‌గా తీసుకున్నట్టులేదు.

తను దూరమైనా సుభద్ర పెద్దగా బాధపడదనిపించింది.

శంకరంకోసం అంత త్యాగం చెయ్యాలా అనిపించిం దతనికి. సుభద్ర సౌందర్యం వొకవైపూ శంకరం అర్థింపు మరోవైపూ అతని హృదయాన్ని త్రాసుచేసి వూగిసలాడాయి.

సుభద్రను వదులుకున్నా అది త్యాగం ఏమాత్రమూ కాకపోగా, శంకరంవంటి భోళామనిషి పట్ల నాగరికుడు చూప వలసిన సానుభూతిగా అనిపించింది.

రెండోనాటికి రూము మార్చేశాడు రాజు. ఆ తర్వాత సుభద్ర నెప్పుడూ చూడలేదు.

మరుసటేడాదే సుభద్ర ఇంటర్ ముగిసింది, శంకరంతో పెళ్ళి జరిగి పోయింది. అంతటితో సెకెండియర్ డిగ్రీ చదువు డిస్‌కంటిన్యూ చేసేశాడు శంకరం.

పోనీ – తను అంత నిర్మమకారంగా ప్రవర్తించినందుకు – వాళ్ళిద్దరూ అయినా సుఖపడినందుకు సంతోషించాడు రాజు. సీరియస్‌గా తన చదువులో తాను పడ్డాడు.

అనుకోనివి జరగటమే జీవితం కదా.

రాజు అన్నదాన్నిబట్టి శంకరం జీవితంలో అనుకోని మార్పులు చాలా జరిగాయి.

తండ్రి అకస్మాత్తుగా మరణించ టంతో బాటు ఆస్తిపాస్తుల విషయంలో దాయాదుల దురన్యాయం కూడా అతన్ని బాగా కుంగదీసింది.

అదివరకూ వున్న ధీమా అంతా ఎగిరిపోయింది శంకరంలో.

పిత్రార్జితం కరారవుతు అయిపోయే దశ చేరుకునేసరికి, ఉద్యోగాల వేటలో పడక తప్పలేదు....

* * *

కోలారులో బస్ ఆగింది.

పాసింజర్లంతా టిఫిన్లకి దిగుతున్నారు.

కథ చెప్పటం ఆపి, "ఎలా వుంది కథ ?–" అన్నాడు శేఖర్.

"బాగుంది –"

"అదేంవిటోయ్ .... సరే .... కాస్త టిఫిన్ చేసొద్దాం రా...."

"నా కొద్దు....ఎలాగో వుంది....మీ రెళ్ళి చేసిరండి...."

"భలేదానివే – నీ కొద్దంటే నాకు మాత్రం ఎందుకూ ?...." అని బస్ దిగి దగ్గర షాపులోంచి ద్రాక్షలూ అరటి పళ్ళూ కొన్నాడు.

అటుగా వొచ్చాడు బస్‌డ్రైవర్.

"హలో ! –" అన్నాడు శేఖర్ తమాషాగా నవ్వుతూ.

"మీరు...." అన్నాడు డ్రైవర్, గుర్తుతెచ్చుకోబోతూ. అంతలో శేఖర్ గారు అన్నాడు వెలిగిపోతూ.

కాని ఆ డ్రైవర్ ముఖంలో సహజంగా ఉల్లాసం ఉత్తేజంవంటి వేమీ మిగిలినట్టు లేదు.

జీవిత కఠిన వాస్తవాల కొలిమి వేడికి అతను బాగా వాడిపోయాడు.

అతన్ని మాట్లాడించాలని శేఖర్ రెండు మూడు ప్రయత్నాలు చేశాడుగాని, అవేమీ పెద్దగా ఫలించకపోవటంతో, బస్‌లో కొచ్చేశాడు.

"బెంగుళూరులో మాట్లాడుకుందాం లెండి –" అన్నాడు డ్రైవర్ వెనుక నుంచి.

తర్వాత డ్రైవరూ నిర్వికారంగా బస్సెక్కాడు. బస్సు కదిలి వేగం పుంజుకుంది.

సీటుకి జేరగిలబడి అలా కొంచెం సేపు ఉండిపోయిన శేఖర్ ఇంకొంత సేపటికి అన్నాడు — "జీవితం బహు చిత్రమైంది కదూ శిరీ....ఇంతసేపూ చెప్పిన కథలో రాజు – నేనే, శంకరం – ఆ డ్రైవర్ !...."

"అవునా !! –" అన్నట్టు ఆశ్చర్య పోతూ చూసి, ఆ తరువాత 'అనుకున్నా న్లెండి' – అన్నట్టు చిన్నగా నవ్వింది శిరీష.

"చూడు–ఆ ధీమా అంతా ఏమైందో... ఇలా నిర్లిప్తంగా బస్ నడుపుతున్నాడు. అనగూడదుగాని .... ఇతనితో సుభద్ర సుఖపడుతోంటుందంటావా?..ఏంమ్మాట్లా దవు?...."

ఏం మాట్లాడాలో తెలిసినా, మాట్లాడదలచనిదానిలా కాస్సేపు అలాగే వుండిపోయింది శిరీష.

"హనీమూన్ ఇంత ఫ్లాష్‌బాక్‌తో మొదలవుతుం దనుకోలేదు ...." అంది ఫిలాసఫికల్‌గా నవ్వుతూ.

"ప్రపంచం ఇంత దగ్గర దగ్గరగా వుంటుందేం అనిపిస్తోంది....జీవితం మీ రనుకునేదానికన్నా నే ననుకునేదాని కన్నా చాలా చాలా విచిత్రం....నేనూ వో సంగతి చెప్పాలి....మీరేమీ అనుకోరు గదూ....అసలు నే నలా అడగటమేమిటి ? మీలాంటి సంస్కార వంతుడు దొరకటం నా అదృష్టమే...."

"ఏంటి శిరీ....నువ్వంటున్నది...."

"ఏం లేదు....హైస్కూల్లో నాకో అభిమానుండేవాడు. నేనంటే పడిచచ్చే వాడు....రోజూ పారిజాతాలతో చెట్టుకింద నా పేరు రాసేవాడు....వోసారి అతను నాకో ఇరవై పేజీల ఉత్తరం రాశాడు. దాన్ని హెడ్‌మాస్టర్ కిచ్చి రిపోర్ట్ చేశాను....స్కూల్ మీటింగ్‌లో అందరి ముందూ అతన్ని నిలబెట్టి చెడామడా తిట్టి నాకు క్షమాపణ చెప్పించారు.... వారం రోజులు సస్పెండ్ చేశారు.... స్కూల్లో వున్నన్ని రోజులూ అతను నాకేసి మళ్ళీ ఎప్పుడూ చూడలేదు.... అతను ఎవరో కాదు.... ఈ బస్ డ్రైవరే...."

శేఖర్ దిమ్మెరపోయాడు.

బస్సేదో మలుపు తిరిగింది.